నీటి ఎద్దడిపై ముందస్తు చర్యలు


వార్డుల్లో పర్యటిస్తున్న అధికారులు

- వార్డుల్లో పర్యటిస్తున్న అధికారులు
- 'అమృత్'లో రెండు రక్షిత నీటి సరఫరా ట్యాంకుల మంజూరు
- పది బోర్లతో పాటు లీజుకు నాలుగు ట్యాంకర్లు

రామాయంపేట(మెదక్): వేసవి నేపథ్యంలో మున్సిపాలిటీ పరిధిలో తాగు నీటి ఎద్దడి తలెత్తకుండా ఆశాఖ అధికారులు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా మున్సిపల్ కమిషనర్ దేవేందర్, ఏఈ మహేశ్ ఆధ్వర్యంలో వార్డు అధికారులు, ఇతర సిబ్బంది పట్టణంలోని 12 వార్డుల్లో పర్యటించి ముందస్తు సర్వే నిర్వహించి పరిస్థితిని సమీక్షించారు. ఇప్పటికే మున్సిపాలిటీ పరిధిలో 16 వాటర్ ట్యాంకులుండగా, కొత్తగా అమృత్ పథకం కింద మరో రెండు ట్యాంకులు మంజూరయ్యాయి. స్థానిక ఎంపీపీ కార్యాలయ ఆవరణలో, తహసీల్దార్ కార్యాలయం వద్ద వీటిని నిర్మించనున్నారు. వేసవిలో ఏ వార్డులోనైనా నీటి ఎద్దడి తలెత్తితే వెంటనే సమస్య పరిష్కరించే విధంగా అధికారులు కార్యాచరణ రూపొందించారు. కొన్ని కాలనీల్లో కొత్తగా నిర్మించుకున్న ఇళ్లకు నీటి సరఫరా విషయమై వివరాలు రూపొందించారు. మున్సిపాలిటీ పరిధిలోని రామాయంపేట, కోమటిపల్లి, గుల్వర్తి గ్రామాల్లో, రామాయంపేట, కోమటిపల్లి తండాల్లో మొత్తం 69 బోర్లు ఉన్నాయి. వీటిలో కొన్ని చెడిపోయాయి. వాటికి వెంటనే మరమ్మతులు చేయిస్తున్నారు. నీటి ఎద్దడి నెలకొన్న వార్డుల్లో ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్నారు. అత్యవసర పరిస్థితుల్లో అదనంగా మరో 10 బోర్లు, నాలుగు ట్యాంకర్లు లీజు తీసుకోవాలని నిర్ణయించారు. ఇప్పుడిప్పుడే కొన్ని వార్డుల్లో నీటి ఎద్దడి సమస్య విషయమై ఫిర్యాదులు రాగా అధికారులు దృష్టి సారించారు. గత రెండు రోజులుగా కేసీఆర్ కాలనీలో నీటి ఎద్దడి సమస్య నెలకొనగా, ట్యాంకర్ ద్వారా నీరు సరఫరా చేశారు.

సమస్య తలెత్తకుండా చూస్తాం



ఈ వేసవిలో మున్సిపాలిటీ పరిధిలో నీటి ఎద్దడి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. ఇందులో భాగంగా వార్డుల్లో పర్యటించి పరిస్థితిని సమీక్షించాం. అవసరమైతే పది బోర్లతో పాటు నాలుగు ట్యాంకర్లను లీజుకు తీసుకొని సమస్య తలెత్తకుండా చూస్తాం. అదనంగా రెండు ట్యాంకుల నిర్మాణం త్వరలో ప్రారంభం అవుతుంది.

– దేవేందర్, మున్సిపల్ కమిషనర్

రాజ్యాతండా రోడ్డు.. రాళ్లు తేలింది చూడు

రోడ్డు మధ్యలో ప్రమాదకరంగా గొయ్యి


రాజ్యా తండా రోడ్డు మధ్యలో కల్వర్టుపై గొయ్యి

పాపన్నపేట(మెదక్): రాజ్యాతండా రోడ్డు రాళ్లు తేలడంతో గిరిజనులకు నడక నరకంగా మారింది. నడి రోడ్డులో కల్వర్టుపై గొయ్యి ఏర్పడినా పట్టించుకునే నాథుడే లేడు. పాపన్నపేట మండలం రాజ్యాతండాకు వెళ్లేందుకు సుమారు ఐదేళ్ల క్రితం మెటల్ రోడ్డు వేశారు. అనంతరం మూడేళ్ల క్రితం సీసీ రోడ్డు మంజూరైంది. ఈ మేరకు టెండర్లు కూడా పూర్తయ్యాయి. కానీ బిల్లులు సకాలంలో రావడం లేదన్న ఆలోచనతో సదరు కాంట్రాక్టర్ అసలు పనులు ప్రారంభించలేదు. దీంతో అటు కశ్నాతండా, ఇటు జయరాం తండాకు వెళ్లే గిరిజనులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ మూడు తండాల గిరిజనులు కనీసం కిరాణం సామాను కొనాలన్నా, 4 కి.మీ దూరంలో గల నార్సింగికి, 6 కి.మీ దూరంలో ఉన్న పాపన్నపేటకు రావాల్సి ఉంటుంది. ప్రతి రోజు కనీసం 200 మంది అయినా ఈ రోడ్డు గుండా తిరుగుతుంటారు. రోడ్డు ప్రారంభంలోనే కల్వర్టుపై గొయ్యి ఏర్పడింది. రాత్రి పూట ఏదైనా వాహనం గాని మనుషులు, మూగజీవాలు గానీ అందులో పడే ప్రమాదం ఉంది. అయినా ఆ రోడ్డును పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ఈ రోడ్డు మంజూరు చేయాలని ఎమ్మెల్యే రోహిత్‌రావుకు వినతి పత్రం సమర్పించినట్లు అర్కెల కాంగ్రెస్ నాయకులు జనార్దన్ రెడ్డి తెలిపారు. వెంటనే రోడ్డు మంజూరు చేయాలని కోరారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు


మలుపు వద్ద రక్షణ చర్యలు చేపడుతున్న పోలీసులు

నర్సాపూర్‌రూరల్: రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని ఎస్ఐ లింగం తెలిపారు. గురువారం నర్సాపూర్– హైదరాబాద్ 765డీ జాతీయ రహదారి కొండాపూర్ అటవీప్రాంతంలోని మలుపు వద్ద ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి ఆదేశాల మేరకు రోడ్డు మధ్యలో స్ప్రింగ్ బోలార్డ్‌లను ఏర్పాటు చేయించారు. కొండాపూర్ నుంచి రెడ్డిపల్లి వరకు సుమారు 15 కిలోమీటర్ల దూరం ఉన్న మలుపుల వద్ద తరుచూ ప్రమాదాలు జరిగి అనేక మంది ప్రమాదాలకు బారిన పడ్డారని చెప్పారు. ప్రమాదాల నివారణకు పోలీస్‌శాఖ తరఫున ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని వివరించారు.

నాణ్యమైన భోజనాన్ని అందించాలి


వంటశాలలో సామగ్రిని పరిశీలిస్తున్న ఈఈ నర్సింలు

మనోహరాబాద్(తూప్రాన్): విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని మండల ప్రత్యేక అధికారి, జిల్లా పంచాయతీరాజ్ ఈఈ నర్సింలు సూచించారు. గురువారం మనోహరాబాద్ మండలం కూచారంలో గల కస్తూర్బా గాంధీ పాఠశాలలో వంటశాలను, విద్యార్థుల భోజనాన్ని పరిశీలించారు. పాఠశాలలో రికార్డులను పరిశీలించారు. . అనంతరం పదవ తరగతి విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టారు. వీరి వెంట ఎంపీడీఓ కృష్ణమూర్తి, ఎంపీఓ లక్ష్మీనర్సయ్య, పాఠశాల ఎస్ఓ గౌతమి తదితరులు ఉన్నారు.

శతశాతం ఉత్తీర్ణత సాధించాలి


విద్యార్థుల నైపుణ్యాలు పరిశీలిస్తున్న ఎంఈఓ విఠల్

ఎంఈఓ విఠల్

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండల కేంద్రమైన చిలప్‌చెడ్ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలతో పాటు, ఫైజాబాద్, బండపోతుగల్ ప్రాథమిక పాఠశాలలను గురువారం మండల విద్యాధికారి విఠల్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదో తరగతి విద్యార్థులకు జరుగుతున్న ప్రీ ఫైనల్ పరీక్షలు పరిశీలించి, శతశాతం ఉత్తీర్ణత సాధించే దిశగా కృషి చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ప్రాథమిక పాఠశాలల్లో పాఠ్యాంశాల బోధన విధానాలను, విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించామని తెలిపారు.

అదుపు తప్పిన ఆటో.. ఆరుగురికి గాయాలు

నిజాంపేట(మెదక్): ఓ ఆటో అదుపు తప్పడంతో ఆరుగురికి గాయాలయ్యాయి. రామాయంపేట మండల పరిధిలో కాట్రియాల గ్రామానికి చెందిన రాగి రాజయ్య కూతురుకు పెళ్లి చూపులకు సిద్దిపేట జిల్లాలోని దుబ్బాకకు వెళ్లి తిరిగి వస్తున్నారు. ఈ క్రమంలో ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ఆటో పెట్రోల్ బంక్‌లోకి దూసుకెళ్లి బోల్తా పడింది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న ప్రయాణికులకు గాయాలయ్యాయి. వీరిని వెంటనే 108లో రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

ఘనంగా గంగాదేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం


కాద్లూర్‌లో ధ్వజ స్తంభాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండలం కాద్లూర్ గ్రామంలో ముదిరాజ్ సంఘం ఆధ్వర్యంలో గంగాదేవి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.

ముదిరాజ్‌లను బీసీ ఏలో చేర్చాలి


ప్రమాణం చేస్తున్న నూతన ముదిరాజ్ కార్యవర్గం

జిల్లా అధ్యక్షుడుగా జనార్దన్

సంగారెడ్డి : ముదిరాజ్ సంఘం నూతన కార్యవర్గాన్ని గురువారం 29 మందితో కూడిన సభ్యులను ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జనార్దన్, అసోసియేట్ అధ్యక్షుడిగా రాములు, ప్రధాన కార్యదర్శిగా రమేష్, కోశాధికారిగా ప్రభాకర్, ఉపాధ్యక్షుడిగా తిరుమలరావు, సంయుక్త కార్యదర్శిగా శ్రీనివాస్, ప్రచార కార్యదర్శిగా రామకృష్ణ సహాయ ప్రచార కార్యదర్శిగా నర్సింలు, సలహాదారుగా నారాయణ వివిధ సభ్యులను వివిధ హోదాల్లో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జనార్దన్ మాట్లాడుతూ.. ముదిరాజ్‌లను అన్ని రంగాల్లో అభివృద్ధి చెందేలా కృషి చేస్తానన్నారు. బీసీల్లో అధిక సంఖ్యలో జనాభా ఉండటంతో తాము నష్టపోతున్నామని అన్నారు. ప్రభుత్వం స్పందించి బీసీ బి నుంచి బీసీ ఏకు మార్చాలని కోరారు. కార్యక్రమంలో గోపాల్, రాంచందర్, శ్రీనివాస్, లక్ష్మి, సుగుణాకర్ తదితరులు పాల్గొన్నారు.

కనుల పండువగా విగ్రహ ప్రతిష్ఠాపన


ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి దంపతులు

నారాయణఖేడ్: పట్టణ శివారులో నూతనంగా నిర్మించిన భక్తమార్కండేయ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం కనుల పండువగా సాగింది. రాంపూర్ ఆశ్రమ పీఠాధిపతి మాదవానంద సరస్వతీ స్వామితో పాటు అంతర్గాం పీఠాధిపతి కరణ్ గజేంద్ర భారతి మహరాజ్, కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి సంగ్రాం మహరాజ్ మంత్రోచ్ఛారణల మధ్య ప్రతిష్ఠాపనోత్సవం నిర్వహించారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి, అనుపమారెడ్డి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవాల్లో మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి, జీఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ మశ్చందర్, జిల్లా ప్రణాళికా సంఘం మాజీ సభ్యులు నగేష్ షెట్కార్, టీపీసీసీ సభ్యులు కర్నె శ్రీనివాస్, పద్మశాలీ సంఘం బాధ్యులు పాల్గొన్నారు.

ఘనంగా స్వయంపాలన


బొడ్మట్‌పల్లిలో స్వయంపాలన దినోత్సవం

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండలం బొడ్మట్‌పల్లి ప్రాథమిక పాఠశాలలో గురువారం స్వయం పాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల హెచ్‌ఎంగా నవీన్ కుమార్, ఉపాధ్యాయులుగా లాక్య శ్రీ, కైకష, జెస్విక, జగదీష్, అఖిల్ వ్యవహరించారు. బోధన కార్యక్రమాన్ని పాఠశాల హెచ్‌ఎం సాజిద్ పాషా, ఉపాధ్యాయులు రాణి, శేఖర్‌లు పర్యవేక్షించి ఉత్తమంగా బోధించిన వారికి బహుమతులను అందించారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ కమిటీ చైర్మపర్సన్ నర్సమ్మ పాల్గొన్నారు.

మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ కల్పించాలి

మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్రహం మాదిగ


జహీరాబాద్‌లో నిర్వహిస్తున్న డప్పుల ప్రదర్శన

జహీరాబాద్ టౌన్: ఎస్సీ వర్గీకరణలో మాదిగలకు 11 శాతం రిజర్వేషన్ కల్పించాలని మహాజన సోషలిస్ట్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అబ్రహం మాదిగ డిమాండ్ చేశారు. మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు పట్టణంలో గురువారం డప్పుల ప్రదర్శన నిర్వహించారు. అతిథిగృహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు డప్పుల ప్రదర్శనతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణ అశాస్త్రీయంగా ఉందని, మాదిగ జనాభాను తగ్గిస్తున్నారని ఆరోపించారు. 11 శాతం రిజర్వేషన్లు కల్పించాల్సి ఉండగా 9 శాతం మాత్రమే ఇస్తున్నారని వాపోయారు. ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు బుచేంద్ర మాట్లాడుతూ.. రిజర్వేషన్ వ్యవహారంలో లోపాలు ఉన్నాయని వాటిని సవరించాలన్నారు. మంత్రి వర్గవిస్తరణలో మాదిగలకు రెండు మంత్రి పదవులు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు జైరాజ్ మాదిగ, రాంచందర్, నవీన్‌కుమార్, మచ్చేందర్, శ్రీనివాస్, ప్రవీణ్, నర్సింలు, రాజు, మైకేల్ పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ రూ.2లక్షల ఎల్‌ఓసీ అందజేత

శివ్వంపేట(నర్సాపూర్): అనారోగ్యంతో బాధపడుతున్న వ్యక్తికి చికిత్స నిమిత్తం ఎల్‌ఓసీని బీఆర్‌ఎస్ నాయకులు గురువారం అందజేశారు. మండల పరిధి తిమ్మాపూర్ గ్రామానికి చెందిన పాపమ్మ అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న విషయం స్థానిక ఎమ్మెల్యే సునీతారెడ్డి దృష్టికి తీసుకెళ్లగా.. చికిత్స నిమిత్తం ప్రభుత్వం నుంచి రెండు లక్షల రూపాయల ఎల్‌ఓసీని మంజూరు చేయించారని బీఆర్‌ఎస్ నాయకుడు అశోక్ తెలిపారు. కార్యక్రమంలో నాయకులు వెంకట్‌స్వామి, కుమార్, ప్రవీణ్, అంజగౌడ్, యాదగౌడ్, అంజనేయులు, తదితరులు ఉన్నారు.

◆ పోచమ్మ విగ్రహ పునః ప్రతిష్ఠ మహోత్సవం

కొల్చారం(నర్సాపూర్): మండలంలోని సంగాయిపేటలో నూతనంగా నిర్మించిన పోచమ్మ తల్లి ఆలయంలో అమ్మవారి విగ్రహ పునఃప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం కోసం ఆలయం ముస్తాబైంది. ఈ ఉత్సవాలు శుక్రవారం నుంచి మూడు రోజులపాటు కొనసాగనున్నాయి. దాతల సహకారంతో ఆలయాన్ని నిర్మించారు.

◆ పశువుల షెడ్లు, నర్సరీల పరిశీలన

జహీరాబాద్ టౌన్: జాతీయ ఉపాధిహామీ పథకం కింద నిర్మిస్తున్న పశువుల షెడ్లు, నర్సరీలను గురువారం మొగుడంపల్లి మండల ఏపీఓ గణేష్ పరిశీలించారు. మండలంలోని మాడ్గి, ఔరంగ్‌నగర్‌లో ఈజీఎస్ నిధులతో పశువుల షెడ్లు, నర్సరీలో మొక్కలు పెంచుతున్నారు. పశువుల పెంపకానికి అనువుగా షెడ్ల నిర్మాణం, నర్సరీల్లో పనులు జరుగుతున్నాయని పరిశీలించారు. ఆయన వెంట టెక్నికల్ అసిస్టెంట్ సంజు ఉన్నారు.

◆ వేతనాలు చెల్లించాలని వినతి

రాయికోడ్(అందోల్): రాయికోడ్‌లోని తెలంగాణ ఆదర్శ పాఠశాల, కళాశాలలో గంటల ప్రాతిపదికన పాఠాలు బోధిస్తున్న హెచ్‌బీటీల పెండింగ్ వేతనాలు చెల్లించాలని మండల విద్యాధికారి అంజయ్యకు గురువారం వినతిపత్రం అందజేశారు. గత ఏడాదికి సంబంధించి రెండు నెలల వేతనాలు చెల్లించాల్సి ఉన్నా ఇప్పటివరకు రాలేదన్నారు. జీతాలు రాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. రెగ్యులర్ ఉపాధ్యాయులతో సమానంగా నిబద్ధతతో విధులు నిర్వహిస్తున్నా తమకు తగిన గుర్తింపు లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

బీజేపీ నాయకుల సంబురాలు


చేగుంటలో సంబరాలు చేసుకుంటున్న బీజేపీ నాయకులు


హవేళిఘణాపూర్‌లో ....


పెద్దశంకరంపేటలో...

బీజేపీ అభ్యర్థులు ఎమ్మెల్సీ మల్క కొమరయ్య, చిన్మయిల్ అంజిరెడ్డి గెలుపొందడంతో గురువారం జిల్లావ్యాప్తంగా ఆ పార్టీ నాయకులు సంబురాలు నిర్వహించారు. బాణసంచా పేలుస్తూ ఒకరికొకరు మిఠాయిలు తినిపించుకున్నారు.


చిన్నశంకరంపేటలో...


రామాయంపేటలో...


టేక్మాల్‌లో...


శివ్వంపేటలో...


చిలప్‌చెడ్‌లో...


మనోహరాబాద్‌లో ..

క్లుప్తంగా

చలివేంద్రం ఏర్పాటు అభినందనీయం


బస్టాండ్‌లో చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ నారాయణగౌడ్

చిన్నశంకరంపేట(మెదక్): వేసవిలో చలి వేంద్రం ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్ఐ నారాయణగౌడ్ అన్నారు. గురువారం చిన్నశంకరంపేటలోని ఎంపీపీ కార్యాలయ సముదాయం ఎదురుగా బస్‌స్టాండ్‌లో ఎన్ఆర్ఐ చంద్రశేఖర్, డాక్టర్ శ్రీధర్ ఆధ్వర్యంలో చలి వేంద్రం ఏర్పాటు చేయగా ఎస్ఐ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేసవిలో దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఎన్ఆర్ఐ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

పరీక్షల భయాన్ని వీడాలి

ఇంపాక్ట్ ఫౌండేషన్ వక్త లింగరాజు


మాట్లాడుతున్న వక్త లింగరాజు

పాపన్నపేట(మెదక్): విద్యార్థులు భయాన్ని వీడి పరీక్షలు రాసినప్పుడే అనుకున్న లక్ష్యాన్ని చేరుతామని ఇంపాక్ట్ ఫౌండేషన్ వక్త లింగరాజు అన్నారు. గురువారం మండల పరిధిలోని పొడిచన్‌పల్లి పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు ప్రేరణాత్మక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ లక్ష్యాలను ఎలా నిర్ధారించుకోవాలో వివరించారు. అనుకున్న గమ్యాన్ని చేరుకోవడానికి మైండ్‌సెట్ ఎలా అభివృద్ధి పర్చుకోవాలనే అంశాలను, పరీక్షలపై ఉన్న భయాన్ని ఎలా అధిగమించాలన్న మెలకువలను చెప్పారు.

చాకలి ఐలమ్మ విగ్రహావిష్కరణ


చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఆవిష్కరించిన దృశ్యం

నిజాంపేట(మెదక్): నిజాంపేట మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో గురువారం రజక కుల సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చాకలి ఐలమ్మ విగ్రహాన్ని గ్రామ మాజీ సర్పంచ్ నరసింహారెడ్డి, జిల్లా రజక సంఘం అధ్యక్షుడు సంగు స్వామితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు స్వామి మాట్లాడుతూ చాకలి ఐలమ్మ ఆశయాలను కొనసాగిస్తామని తెలిపారు. చాకలి ఐలమ్మ చరిత్రను గుర్తించి గత ప్రభుత్వం ఆమె చరిత్రను పాఠ్య పుస్తకాల్లో చేర్పించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం మహిళ యూనివర్సిటీకి చాకలి ఐలమ్మ పేరు పెట్టారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బాల్‌రెడ్డి, ఉప సర్పంచ్ రమేష్, రజక కుల సంఘ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


వంగిన విద్యుత్ స్తంభానికి వేలాడుతున్న వైర్లు

హవేళీఘణాపూర్(మెదక్): మెదక్ మండల పరిధిలోని తిమ్మానగర్ గ్రామ చెరువు అలుగు వద్ద ఉన్న విద్యుత్ స్తంభం పూర్తిగా వంగిపోయి తీగలు కిందకు వేలాడుతున్నాయి. విద్యుత్ వైర్లు తగిలి ప్రమాదం జరిగే అవకాశం ఉన్నా విద్యుత్ శాఖ అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రమాదాలు జరగక ముందే వాటిని సరి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఉపాధి పనులపై అవగాహన


కూలీలకు అవగాహన కల్పిస్తున్న ఏపీఓ

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా గ్రామాలలో కొనసాగుతున్న ఉపాధి హామీ పనులను ఈజీఎస్ ఏపీఓ నవాజుద్దీన్ గురువారం పరిశీలించారు. అనంతరం ఉత్తులూర్ గ్రామంలో ఉపాధిహామీ కూలీలకు పనులపై అవగాహన పెంచుకోవాలని, వేసవిలో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.